## గణేష్ లడ్డూ వేలంపాటలో గొడవ.. కత్తితో దాడి

**జోగిపేట, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** వినాయకుడి లడ్డూ వేలం పాట విషయంలో గొడవపడిన పోలీసుల జోక్యంతో సద్దుమణిగినప్పటికీ, ఆ విషయాన్ని మనసులో పెట్టుకునికత్తితో దాడి చేసిన సంఘటన శనివారం జోగిపేటలో జరిగింది. వివరాల ప్రకారం జోగిపేటలోని బుడగజంగాల కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకమండపం వద్ద శుక్రవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ విషయంలో సంకు రమేష్, చిత్తారి దుర్గయ్యల మధ్య వాగ్వాదం జరిగి గొడవకు దారితీసింది. విషయం పోలీసులకు సమాచారం అందడంతో వారు వచ్చి ఇద్దరిని సముదాయించటంతో పరిస్థితి సద్దుమణిగింది. కాగా శనివారం బస్టాండు సమీపంలోని ఓ హోటల్ దగ్గర వీరంతా కలిసి టీ తాగుతున్న సందర్భంలో మళ్లీ మాటా మాటా పెరగటంతో రమేష్ దుర్గయ్యను కత్తితో పొడిచాడు. దీంతో అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, దుర్గయ్య కొడుకు నర్సింలు తన తండ్రిని కత్తిపొడిచాడనే కోపంతో రమేష్ తండ్రి నర్సింలుపై దాడి చేయటంతో అతను గాయపడ్డాడు. నర్సింలును కూడా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గైబప్ప కేసు నమోదు చేసుకున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## స్వచ్ఛ భారతావనికి కృషి చేద్దాం : కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అక్టోబరు 2వ తారీఖు వరకు స్వచ్ఛతహి సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాల(ఎ) ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్న ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తన వంతుగా స్వగ్రామంలో ఇండ్లు, పరిసరాలు, కార్యాలయాలు, నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రజలు సైతం పాటించేలా చర్యలు తీసుకుంటామని స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. స్వచ్ఛ భారత్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు కృషి చేయనున్నారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం ప్రవీణ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ పద్మజ, డాక్టర్ అభిజిత్, శివదీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజయపాల్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ శరత్

## మొక్కుబడిగా సంగారెడ్డి జడ్పీ సమావేశం

**సమావేశంలో ఎజెండాలోని అన్ని అంశాలపై జరగని చర్చ**

**ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిలు గైర్హాజరు**

**సంగారెడ్డి బ్యూరో సెప్టెంబరు 23,ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం మొక్కుబడిగా సాగింది. శనివారం సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజశ్రీజయపాల్‌రెడ్డి అధ్యక్షతన జడ్పీ సమావేశం జరిగింది. ఈకార్యాక్రమంలో శాసనసభ్యులు క్రాంతికిరణ్,కె.మానిక్‌రావు, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్,శాసన మండలి సభ్యులు యదవరెడ్డి,రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మేన్ నరోత్తం,టిఎస్ ఐడిసి చైర్మేన్ మొహమ్మద్ తన్వీర్,డిసిఎంఎస్ చైర్మేన్ శివకుమార్,సిఇఓ ఎల్లయ్య,వివిద మండలాల జడ్పీటిసిలు,ఎంపిపిలు వివిదశాఖల అధికారులు ఇద్దరు హాజరయ్యారు.సమావేశానికి ఇద్దరు శాసనసభ్యులు,ఒక శాసనమండలి సభ్యులు హాజరయ్యారు. మిగితా శాసనసభ్యులు,ఇద్దరు ఎంపిలు హాజరుకాలేదు. ఏజెండాలోని అంశాలన్నింటిపై చర్చ జరగకుండానే, కొన్నింటిపై చర్చించి సభను ముగించారు.మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశంలో ఎజెండాలోని అంశాలన్నింటిపై చర్చ జరగకపోవడం మరో విశేషం,చర్చ జరుగుతుండగానే కొందరు,ప్రజాప్రతినిధులు, మరుకొందరు అధికారులు సభ మధ్యల నుండే వెళ్ళీపోవడం గమనర్హం.సమావేశం ముగిసేసమయానికి కొద్ది మంది ప్రజాప్రతినిధులు,అధికారులు ఉండటం సభ ప్రాధాన్యతను తెలయజేసే విధంగా మారింది. సమావేశంలో కొందరు సభ్యులు ఆడిగిన ప్రశ్నలకు సంబందిత అధికారులు సమావేశంలో లేకపోవడం మరోవిశేషం.మొత్తంమీద సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశంలో కొందరు సభ్యులు మాట్లాడుతూ అసైన్డ్ భూములకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదని,సహకార సంఘాలలో పదివేల క్రాప్‌లోన్ కావలన్నా, మార్టిగేజ్ చేయనిదే రుణాలు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సమాదానం కోరకు, డిసిసిబి సిఇఓను సమాధానం చెప్పాలని,జిల్లా కలెక్టర్ శరత్ కోరగా అతని సమావేశానికి హాజరుకాలేదు.కొన్ని అసైన్డ్‌భూముల సర్వేనెంబర్లలో సమస్యల కారణంగా ఇబ్బంది వచ్చిందని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ శరత్ సభ్యులకు హామీ ఇచ్చారు.గత రెండు సంవత్సరాలుగా కొత్తపెన్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, కొత్తపెన్షన్లు ఎప్పుడిస్తారని మరో సభ్యులు ప్రశ్నించారు.పెన్షన్ పోందుతున్న భర్తకాని భార్యకాని చనిపోతే వారిస్థానంలో బార్యస్థానంలో భర్తకు, భర్త చనిపోతే భార్యకు ఇస్తున్నామని జిల్లాలో ఇప్పటి వరకు మూడువేల మందికి ఇచ్చామని డిఆర్‌డిఓ శ్రీనివాసరావు వివరించారు. కొత్త పెన్షన్ల నమోదుకు ఇంకా అవకాశంరాలేదని రాగానే కొత్తవాటని నమోదు చేస్తామని అన్నారు.చెరువుల అక్రమణలకు గురువుతున్న ఇరిగేష్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని రాష్ట్రఎస్సీ కార్పోరేషన్ చైర్మేన్ నరోత్తం,హత్నూర జడ్పీటిసి అంజనేయులు అధికారులను ప్రశ్నించారు. జిన్నారం మండలంలోని చెరువులో కట్టడాలు కట్టారని గత మూడు సంవత్సరాలుగా జడ్పీ సమావేశాల్లో ప్రశ్నిస్తున్న ఇరిగేష్న్, ఆటవిశాఖ అధికారులు స్పందించడంలేదని జడ్పీవైస్ చైర్మేన్ ప్రభకర్ అధికారుల తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. డిఎఫ్ఓ,ప్రభాకర్‌కు మధ్య తీవ్ర వాగ్వేవాదం జరిగింది.జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీమాట్లాడుతూ జడ్పీలో నిధుల అవసరం గురించి ముఖ్యమంత్రి కెసిఆర్‌తో చర్చించడం జరిగిందని,జిల్లాకు 50కోట్లు ఇవ్వడానికి హామీ ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్యే క్రాంతికిరన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సంక్షేమపథకాలు ఇతరరాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కొత్తపాథకాలు ప్రవేశపెట్టి ఆమలు చేయడం సిఎం కెసిఆర్‌కే సాధ్యమైందని అన్నారు.లోక్‌సభలో మహిళాబిల్లు అమోదంపోండటంపట్ల పలువురు మహిళా ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నూతన చైర్మేన్ భాద్యతలు చేపట్టి మొదటిసారి సమావేశానికి హాజరైన నరోత్తం,మెహమ్మద్ తీన్వర్‌లకు జడ్పీచైర్‌పర్సన్ ఇతర సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు.

## బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి : తపస్



జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్23 ప్రభాతవార్త:**
ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల ప్రకారం మెడికల్ గ్రౌండ్, స్పౌజ్ వాడుకునేలా ఆదేశాలు ఇవ్వాలని, బదిలీలు, పదోన్నతుల సీనియారిటీ జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని, కోర్టు తీర్పుకు లోబడి బాషా పండిట్‌లకు, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వాలని, జాబితాలలో ఏవైనా పొరపాట్లు ఉంటే సవరించాలని జిల్లా విద్యాధికారిని కోరడం జరిగిందన్నారు. తపస్ బాధ్యులు నర్సింలు, నరేందర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి మైనంపల్లి?

- తిరుపతిరెడ్డి వ్యూహం ఏంటి
- సన్నిహితులతో ఆవేదన వ్యక్తం చేసిన తిరుపతిరెడ్డి
- అధిష్టానం ఆదేశాలే శిరోధార్యం అంటున్న నేతలు
- కార్యకర్తలే నా ధైర్యం
- మైనంపల్లి రాకతో కాంగ్రెస్‌లో జోష్ పెరగనుందా



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అంతర్ చిత్రంలో మైనంపల్లి హనుమంతరావు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్23 ప్రభాతవార్త:**
బీఆర్ఎస్ మెదక్ టికెట్ ఆశించి భంగపడిన మైనంపల్లి గత కొన్ని రోజులుగా పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేస్తూ చివరికి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తన కుమారుడిని రాబోయే ఎన్నికల్లో మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయించాలని గత కొంత కాలంగా పావులు కదుపుతున్న ఆయనకు బీఆర్ఎస్ అధినేత మెదక్ టికెట్‌ను ప్రస్తుత ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికే కేటాయించి షాక్ ఇచ్చారు. ముందునుంచి పార్టీ తనకు అవకాశం కల్పిస్తుందని భావించి దెబ్బతిన్న మైనంపల్లి పార్టీపై తీనరవ విమర్శలు చేశారు. అదే సందర్భంలో మెదక్ అసెంబ్లీపై హరీష్‌రావు పెత్తనం ఏంటని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ మల్కాజిగిరి టికెట్‌ను అధిష్టానం మైనంపల్లికే కేటాయించింది. దీనిపై స్పందించిన మైనంపల్లి తన కుమారుడికి మెదక్ టికెట్ ఖచ్చితంగా కావల్సిందే అని, త్వరలో తన కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. ఎట్టకేలకు శుక్రవారం మైనంపల్లి బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌లో చేరిక దాదాపు ఖారారైనట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిత్వంతో పాటు తన కుమారుడికి టికెట్ కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సన్నిహితుల ద్వారా తెలుస్తుంది. తాను ప్రత్యక్షంగా ప్రకటించికపోయినప్పటికీ శనివారం మల్కాజ్‌గిరి కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఇదిలా ఉంటే మైనంపల్లి చేరిక ఖరారైతే తన రాజకీయ భవిష్యత్తు ఏంటని మెదక్ డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనంపల్లి రాక లాంఛనమేనని మీడియాలో వస్తున్న కథనాలతో తిరుపతిరెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేతలు, కార్యకర్తలతో భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. ఒక వైపు ఆందోళన వ్యక్తం చేస్తూనే పార్టీలోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తామని, కానీ కష్టపడిన వారిని కాకుండా కొత్తవారికి టికెట్ కేటాయించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ దాదాపుగా కనుమరుగవుతున్న సమయంలో తాను పార్టీ బాధ్యతలు చేపట్టి పది సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసమే అహర్నిషలు కృషి చేశానని అన్నారు. ప్రతి కార్యకర్త మంచి చెడు చూడటంతో పాటు నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా వెంటనే స్పందిస్తూ అందరికీ అందుబాటులో సేవలు అందిచానన్నారు. గ్రామాల కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేతల సహకారంతోనే తాను పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ అధిష్టానం కొత్తగా పార్టీలోకి చేరిన వారికి టికెట్ కేటాయిస్తే కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

**అధిష్టానం ఆదేశాలే శిరోధార్యం అంటున్న నేతలు**

కాంగ్రెస్‌లో మైనంపల్లి రాకతో జిల్లా పార్టీలో నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పార్టీ పటిష్టతకు ఎంతగానో కృషి చేశారని, ఆయనకే టికెట్ కేటాయించాలని సీనియర్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ ప్రస్తుత మెదక్ నియోజకవర్గంలో పార్టీలో విభిన్న పరిస్థితులు ఉన్నాయని, అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేస్తే మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నాయకుల్లో, కార్యకర్తల్లో విభేదాలు లేకుండా అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించిన వారి గెలుపుకు కృషి చేస్తామన్నారు. మెదక్ అసెంబ్లీ టికెట్ కేటాయింపుపై అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ అందరూ ఊహించినట్లుగానే మైనంపల్లికి మెదక్ టికెట్ కేటాయిస్తే పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన తిరుపతిరెడ్డికి సముచిత స్థానం కల్పించేలా హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**మైనంపల్లి రాకతో కాంగ్రెస్‌లో జోష్ పెరగనుందా..**

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్న వార్తలు వినిపిస్తున్నాయి. మైనంపల్లి చేరిక కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతుందని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా పార్టీలో ద్వితీయ శ్రేణి నేతల విభేదాలతో గందరగోళంలో ఉన్న కొంతమంది నాయకులు, కార్యకర్తలు మైనంపల్లి చేరికతో ఒకే తాటిపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. మైనంపల్లి రాకను నాయకులు స్వాగతిస్తున్నప్పటికీ టికెట్ కేటాయించడం పట్ల కొంత భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అవి అంతర్గత సమస్య అని, నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి కలిసి పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి అవకాశాలు లభిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అటు కాంగ్రెస్ సీనియర్ నేతలు స్పందిస్తూ మైనంపల్లితో ఎలాంటి విభేదాలు లేవని, టికెట్ కేటాయింపులోనే అధిష్టానం ఆలోచించాలని కోరుతున్నారు. ఒకవేళ అధిష్టానం పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకుంటే ఖచ్చితంగా అందరం కలిసిగట్టుగా పనిచేస్తామన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మైనంపల్లి చేరికతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలకు తావు లేకుండా పూర్తిస్థాయిలో కార్యకర్తలు, నాయకులు కొత్త ఉత్సాహంతో పనిచేస్తూ పార్టీ విజయానికి దోహదపడాలన్నారు.

## ఆయిల్ ఫాం సాగులో వేగం పెంచాలి

**కలెక్టర్ అధికారులకు సూచన**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఆయిల్ ఫాం సాగులో వేగం పెంచి ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయ, ఉద్యానవన, అయిల్ ఫెడ్ కార్పొరేషన్ అధికారులతో కలిసి అయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి తన్నీరు హరీష్‌రావు అదేశాల మేరకు అత్యంత లాభదాయకమైన పంట అయిల్ ఫాం సాగును జిల్లాలో మరింత వేగం పెంచాలన్నారు. ఏఈవోలు రైతుల ఇంటికి వెళ్లి అయిల్ ఫాం సాగు వలన కలిగే లాభాలు వివరించి ముందుకు వచ్చేలా చూడాలన్నారు. గ్రామాల్లో అయిల్ ఫాం సాగుపై పెద్ద యెత్తున ప్రచారం చేయాలన్నారు. డిడిలు కట్టించడం ఎంత ముఖ్యమో ప్లాంటేషన్ చేయించడం కూడా అంతే ముఖ్యమన్నారు. బెజ్జంకి మండలంలో అయిల్ ఫాం సాగు నత్తనడకన సాగుతుందని అసహనం వ్యక్తం చేశారు. 2 రోజుల్లో మండలంలో క్లస్టర్ వైస్‌గా ఎలాంటి ప్రణాళికతో ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తారో నివేదిక అందించాలని అదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అయిల్ ఫాంలో వచ్చే లాభాలు వివరించి రైతులు పంటసాగుపై దృష్టి సారించేలా చూడాలన్నారు. అయిల్ ఫాం సాగులో అంతర పంటగా జనుపు, జీలుగ పంటలు వేయడం ద్వారా అయిల్ ఫాం మొక్కకి కర్బన శాతం, నత్రజని అధికంగా అందుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులతో పాటు అయిల్ ఫాం ఫెడ్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో వంద శాతం లక్ష్యాన్ని చేరేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలో రాష్ట్ర అయిల్ ఫెడ్ ఓఎస్‌డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వెంచర్లపై అధికారుల చర్యలు చేపట్టాలి

**గ్రామపంచాయతీ సర్వసభ సమావేశం బహిష్కరించిన వార్డు మెంబర్లు**

**గుమ్మడిదల, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :**
గుమ్మడిదల గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ నరసింహారెడ్డి అధ్యక్షతన సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. కాగా ఈ సమావేశంలో ఇటీవలే చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శి రాములు పాలకవర్గానికి వివరించారు. అనంతరం పలువురు వార్డు సభ్యులు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్ నిబంధనలను పాటించకుండా వెంచర్ను ఏర్పాటు చేశారని ఆయొక్క వెంచర్‌పై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడానికి తీర్మాణం రూపొందించాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. కాగా ఈవిషయంపై కార్యదర్శి అలా రూపొందించలేమని సభ్యులకు తెలిపారు. దీంతో ఒక్కసారిగా సర్పంచ్ మినహా పాలకవర్గం సభ్యులు పూర్తిగా సభను బైకాట్ చేసి వెళ్ళిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత సంవత్సర కాలంగా ప్రైవేటు వెంచరు ఏర్పాటు చేశారని ఈ వెంచర్ అనుమతుల కొరకు గ్రామపంచాయతీ నుండి ఉన్న 25 ఫీట్ల రోడ్డును 40 ఫీట్లుగా తప్పుడు పత్రాలను సృష్టించి అనుమతులు పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఇప్పటివరకు గ్రాం పంచాయతీకి కేటాయించాల్సిన 10శాతం భూమిని కేటాయించకుండా ప్లాట్లను విక్రయిస్తున్నారని, ఈ విషయంపే గత మూడు నెలలుగా పంచాయతీ కార్యదర్శి దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఇదే విషయంపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడానికి తీర్మాణం రూపొందించాలని కోరగా తన పరిధిలోని విషయం కాదని సులువుగా మాటను దాటివేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి స్పందించి ఈ వెంచర్‌పై చర్యలు తీసుకోకపోతే జిల్లా పంచాయతీ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలకంటి రవీందర్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, భాస్కర్, ఆకుల సత్యనారాయణ, రాము,జైపాల్‌రెడ్డి, లలిత, కలకంటి పార్వతమ్మ, రమక్కపేట లలిత, అనితజ్యోతి, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశాన్ని బహిష్కరించి బయటకు వస్తున్న వార్డుసభ్యులు

**పంచాయతీ కార్యదర్శి రాములు వివరణ**

నేడు నిర్వహించిన సర్వసభ సమావేశంలో సభ్యులు వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని తనను కోరారని తెలిపారు. కాగా ఈ వెంచర్ పూర్తిగా హెచ్ఎండిఏ నుండి అనుమతులు పొందిందని అందుకు సంబంధించిన పూర్తి పత్రాలను పంచాయతీకి సమర్పించారని అన్నారు.

ఈ వెంచర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న హెచ్ఎండిఏ పరిధిలోని విషయమని ఆ అంశమే సభ్యులకు వివరిస్తుండా సభను బైకాట్ చేసి వెళ్లిపోయారని తెలిపారు. అయినప్పటికీ పాల కవర్గం అభ్యర్థన మేరకు హెచ్ఎండిఏ రెవెన్యూ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి నివేదిక తయారు చేస్తామని తెలిపారు.



విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో విద్యాశాఖ జెడి సోమిరెడ్డి

## మీ విలువైన సమయమే మీ పిల్లల భవిష్యత్తుకు పెట్టుబడి

**పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి**

**మర్కుక్, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త):**
విద్యార్థుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ప్రతినెలా పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి హాజరై మీ విలువైన సమయం కేటాయిస్తే మీ పిల్లల భవిష్యత్తుకు పెట్టుబడి అవుతుందని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శనివారం మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించగా రాష్ట్ర స్థాయి పరిశీలకులు, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి వారి పిల్లలు చదువుతున్న తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థుల యొక్క ప్రగతిని తెలుసు కున్నారు. పాఠశాల అసెంబ్లీని నిర్వహించిన విధానం పట్ల విద్యార్థులను అభినందించారు. తరగతివారీగా విద్యార్థులు సాధిస్తున్న ప్రమాణాలను తెలుసుకొని ఉపాధ్యాయుల కృషిని మెచ్చుకున్నా రు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి సమావేశమై పాఠశాలలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని, విద్యార్థులు చూపిన ప్రగతి ప్రదర్శననే ఇందుకు నిదర్శనమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ, యాజమాన్య కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, చిన్నికృష్ణ, హారిక, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న జరిగే ప్రజావాణి రద్దు

**మెదక్ అర్బన్, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** ఈ నెల 25న జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఐడీవోసీలో జరుగ నున్నందున సోమవారం జరిగే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దూర ప్రాంతాల నుండి అవస్థలు పడి ప్రజావాణికి రావద్దని, జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఉన్నందున ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

## డీఈడీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ : సీపీ

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలురుల ఉన్నత పాఠశాలలో డీఈడీ పరీక్ష కేంద్రం ఉన్నందున ఈనెల 25 నుంచి అక్టోబర్ 3 వరకు 144 సెక్షన్ విధిస్తున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శనివారం అమె మాట్లాడుతూ డీఈడీ రెండో సంవత్సరం పరీక్షలు ప్రభుత్వ బాలురుల ఉన్నత పాఠశాలల్లో ఈనెల 25 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహిస్తుండడంతో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నా రు. పరీక్ష కేంద్రం సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలని పరీక్ష కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి భద్రతా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను అదేశించారు.

## భగీరథ పైప్‌లైన్ నుంచి వృథాగా నీళ్లు

**అల్లాదుర్గం, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటింటికి మంచినీళ్లు అందిస్తున్నామని ప్రకటనలు చేస్తుంది. కానీ పలు గ్రామాలలో భగీరథ నీళ్లు అందక నీళ్ల కోసం అరిగోసలు పడుతున్నారు. అటు ప్రభుత్వం ఏమో మంచినీళ్లు అందిస్తున్నామని చెబుతుంది. కానీ గ్రామాలలో నీళ్లు అందడం లేదంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మరి దీనికి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రతి గ్రామాలకు నీళ్లు అందే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వర్ మీదుగా నిజామాబాద్‌కు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారానీళ్లను సరఫరా చేస్తున్నారు. అయితే మండలంలోని ఐబి చౌరస్తా చిల్వర్ మధ్యలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై కొన్ని నెలలు గడుస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. లీకైన భగీరథ పైప్‌లైన్ ద్వారా మంచినీళ్లు వృథాగా పారుతూ, కలుషితమవుతున్నా యి. గతంలో ఈ ప్రదేశంలోనే ఈ పైప్‌లైన్ రెండు, మూడు సార్లు పగిలి నీళ్లు వృథాగా ప్రవహించసాగాయి. తిరిగి మళ్లీ అదే ప్రదేశంలో నీళ్లు లీక్ అవుతున్న, ఏ సమయాన పైప్‌లైన్ పగులుతుందేమో అనే భయాందోళనకు గురవుతున్నారు.



హైవే పక్కన లీక్ పైప్‌లైన్

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌కు సన్మానం

**నార్సింగి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా మెదక్ జిల్లాకు చెందిన బక్కి వెంకటయ్య నియామకమయ్యారు. నార్సింగి మండలానికి చెందిన ఎంపీపీ చిందం సబిత, ఎంపీడివో ఆనందమేరీ హైదరాబాదులోని ఎంపీ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ చైర్మెన్ బక్కి వెంకటయ్యను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## అవినీతిమయం అయినా డబుల్‌బెడ్‌రూమ్ పథకం

### నాయిని నరసింహారెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** డబుల్‌బెడ్‌రూమ్ పథకం పూర్తిగా అవినీతిమయంగా మారిందని సీపీఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాయిని నర్సింహారెడ్డి ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మండల కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిజమైన పేదలకు కాకుండా కొంతమంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. నియోజకవర్గంలోని అనేక పరిశ్రమల లో వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఇండ్లల్లో పనిచేసే వాళ్లు, ఆటో డ్రైవర్లు, మట్టిపని వాళ్లు, ట్రాక్టర్ డ్రైవర్లు ఇలా వేలాది మంది పేదలు గత అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని అన్నారు. వీరికి కాకుండ తెల్ల రేషన్ కార్డు లేని వారికి, స్థానికంగా నివాసం లేని వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. అనర్హులను తొలగించాలని, అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జయకుమార్, ఆంజనేయులు, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేషన్ చైర్మన్‌లను సన్మానించిన జడ్పీ చైర్మన్

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్‌గా నియమితులైన టిఎస్ ఐడిసి చైర్మన్ మహ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తంలను జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి శాలువా, పూలబొకేలు అందించి సత్కరించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన మహ్మద్ తన్వీర్, ఏర్పుల నరోత్తంలు కార్పోరేషన్ చైర్మన్‌లుగా ప్రమాణ స్వీకారం చేసి తొలి మారు జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన సందర్భంగా జడ్పీ చైర్మన్ మర్యాద పూర్వకంగా ఇరువురు చైర్మన్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## వినాయకుడిని దర్శించుకున్న మాజీ మంత్రి

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** పట్టణంలోని హౌజింగ్ బోర్డులో వినాయన నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కొలువుదీరిన ప్రథమ పూజలందుకునే పార్వతీ తనయుడు లంబోదరుడిని శనివారం మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య సమన్వయ కర్త డాక్టర్ ఎ చంద్రశేఖర్ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఆయా కాలనీలో కొలువుదీరిన ఏకదండుడిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, కండెం నర్సింలు, గొల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజు మృతికి కారణమైన తల్లి

**పాపన్నపేట, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మానసిక పరిస్థితి బాగ లేక తన్న కన్న కొడుకు మృతికి తల్లి కారణమైన విచారకర సంఘటన శుక్రవారం రాత్రికి మండల పరిధిలోని కందిపల్లి చెరువు వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన వడ్డె లలితకు దుర్గ, కార్తీక్, నాగరాజు ముగ్గురు సంతానం. లలితను భర్త కిష్టయ్య వదిలేయడంతో ఇంటరైన లలిత మానసిక క్షభతో అవస్థలు పడుతూ మానసిక స్థితికి దూరమయింది. శుక్రవారం సాయంత్రం తన సంతానాన్ని తీసుకుని పాపన్నపేటకు వస్తూ మార్గమ ధ్యలో కందిపల్లి చెరువు ఒడ్డున నాగరాజు (18 నెలలు)ను పడుకోబెట్టి వెళ్లిపోయింది. చెరువు ఒడ్డున ఉన్న నాగరాజు ఏడుస్తూ నీటిలో పడిపోయ దన్నారు. విషయం తెలుసుకుని గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా చిన్నారి నాగరాజు తిరిగిరాని లోకాలకు చేరిపోయాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**బెజ్జంకి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపిపి లింగాల నిర్మల, ఎంపిడిఓ దమ్మిని రాము,సర్పంచ్ ద్యావనపల్లి మంజుల అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ అంబేద్కర్ చౌరస్తా నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి బాలికల పాఠశాలలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంతో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి గ్రామ పంచాయతీ నుంచి వచ్చే వాహనానికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కచ్చు చంద్రకళ, ఎస్‌బిఎం కో-ఆర్డినేటర్ చెన్నారెడ్డి,ఎంపివో విష్ణు, అయా పాఠశాలల, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

**బెజ్జంకి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుగ్గిళ్ల గ్రామంలో నూతనంగా చేపట్టిన పాఠశాల ప్రహరి గోడ నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ సీత లక్ష్మీ, కో-అప్షన్ సభ్యులు పాకాల మహిపాల్‌రెడ్డిలు పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నాణ్యతతో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. గ్రామాన్ని దశల వారిగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాల లక్ష్మణ్, సీత భూమయ్య,రేవోజు భాస్కరచారీ, ముక్కిస తిరుపతిరెడ్డి, మిట్టపల్లి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:**

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి జంగరాయిలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చంద్రమౌళి(45), కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా పనులు దొరకకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైయ్యేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగడంతో మెదక్ ఏరియా ఆసుపత్రికి అక్కడి నుండి భాగ్యనగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రమౌళి సాయంత్రం మృతి చెందాడు. మృతుని కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆపదలో ఉన్నతవారికి సీఎం సహాయనిధి ఒక వరం

**నర్సాపూర్,నర్సాపూర్ రూరల్,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునితా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాడు నర్సాపూర్ ఎన్‌జీఓఎస్ కాలనికి చెందిన సమీరా బేగం తండ్రి అమీరుద్దిన్‌కు 1లక్ష రుపాయల చెక్కును కుటుంబసభ్యులకు అందించారు. పేదలకు మెరుగైన వైద్యం చేయించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పేదప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడు తుందన్నారు. అనారోగ్యం,ప్రమాదాల బారిన పడి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పేద, మద్యతరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా భరోసానిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నట్లు వివరించారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో ఆలసత్వం వహించొద్దు

### అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

**హుస్నాబాద్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** పట్టణ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు ఆలసత్వం వహించొద్దని అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు.శనివారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో జరుగుతున్న వైకుంఠధామం,నూతన మున్సిపల్ కార్యాలయం పనులతో పాటు నాన్‌వెజ్ మార్కెట్ పనులను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన మున్సిపల్ కార్యాలయ పనులను వచ్చే డిసెంబరు కల్లా పూర్తి చేయడంతో పాటు మిగతా పనులను సైతం అగ్రిమెంట్ ప్రకారం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించారు.పనుల విషయం లో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**-పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత**

పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాద్యత అని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు.శనివారం రోజున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న ఆధ్వర్యంలో పట్టణంలోని సర్ సివి రామణ్ పాఠశాల విద్యార్థులకు డంపింగ్ యార్డులో తడి,పొడి చెత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.ప్రతీ విద్యార్థి తమ తల్లితండ్రులకు ఇంట్లో ఉన్న చెత్తపై అవగాహన కల్పించాలని తడి,పొడి చెత్త ద్వార రీసైక్లింగ్ ద్వార కంపోస్టు ఎరువు తయారి గురించి వివరించాలన్నారు.ఎరువులు అవసరం లేని వారు ఇంట్లోనే చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని,అలాగే పారిశుద్య కార్మికులు చేస్తున్న సేవలను విద్యార్థులకు వివరించి పారిశుద్య కార్మికుడు సారయ్యను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్,వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినిరవి,కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి,మాజీ ఎంపిపి ఆకుల వెంకట్,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



తొగుట పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

## పోలీసు స్టేషన్లను సందర్శించిన అడిషనల్ డీసీపీ

తొగుట, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : తొగుట సర్కిల్ కార్యాలయం పరిధిలోని తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ పోలీసు స్టేషన్లను శనివారం అడిషనల్ డీసీపీ శాంతి భద్రతలు ఎస్.మల్లారెడ్డి సందర్శించారు. పోలీసు పరిసరా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అయా పోలీసు స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలతో అయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న సస్పెక్ట్, కేడీ, డిసి, రౌడీ, షీట్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్ పరిధిలోని అనుమానితులు, కేడీలు, డీసీ, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. తరచుగా సంబంధిత ఎస్ఐలు బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది వారి యొక్క కదలికలపై నిఘా పెట్టాలన్నారు. వారి ప్రవర్తనపై గ్రామాలలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. పరిశుభ్రత పచ్చదనంతో మంచి అహ్లాదకరమైన వాతావరణంలో పోలీసు స్టేషన్లను ఉంచాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐకు, సిబ్బందికి సూచించారు.రాబోవు ఎన్నికల సందర్భంగా తరచూ గ్రామాలను పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో తొగుట సీఐ కమలాకర్, ఎస్ఐలు లింగం, చైతన్యకుమార్‌రెడ్డి, రఘుపతి తదితరులు ఉన్నారు.

## కత్తి కార్తీక గౌడ్‌కు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలి

**దుబ్బాక, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** దుబ్బాక పట్టణ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు శనివారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.... మన తెలం గాణ ఆడ బిడ్డ, బిసి బిడ్డ తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ కి ఈ సారి దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు, ముఖ్యంగా మహిళల తరుపున రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, మాల్లికార్జున్ ఖార్గేలను కోరారు. ఏఐసిసి ప్రతిపాదించిన ఓబిసి ఎమ్మెల్యే క్యాండెట్ల లిస్ట్‌లో దుబ్బాక నియోజకవర్గనికి సంబందించిన కత్తి కార్తీక పేరు ఉండటం జరిగింది. దుబ్బాక ప్రజలు, కర్యకర్తలు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కత్తి కార్తీకకు టికెట్టు ఇస్తే మేము ఏంటో నిరూపించుకుంటామని దుబ్బాక గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయ గౌడ్, భూంపల్లి మండల ఓబిసి సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రెడ్డి బోయిన శ్రీనివాస్, ఐరేని సాయితేజ్ గౌడ్, కుమ్మరి రవీందర్, నార్సింగి టౌన్ ప్రెసిడెంట్, టిపిసిసి మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నల్ శ్రీనివాస్ రావు, చాకలి నాగరాజు, పట్నం రాములు, బిక్షపతి, ఎల్లం, దేవరాజ్, గిరిబాబు, రాజు నాగిరెడ్డి, అనిల్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**నిజాంపేట, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మంగళి స్వామి (50), వెంకటయ్య (50), బత్తుత చెంద్రవ్వ(65) అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి దయ హృదయంతో స్పందించి శనివారం మంగళి స్వామి కుటుంబానికి 10వేలు, ఇద్దరి కుటుంబాలకు ఒక్కొక్కరికి 5వేల చొప్పున 10 వేలు, మొత్తం 20వేల రూపాయల ఆర్థిక సాయాన్ని మండల కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా మృతుల కుటుంబాలకు అందజేశారు. అదే విధంగా మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుం టామని భరోసా కల్పించారు. అనంతరం కల్వకుంట గ్రామంలో నాగోమొల్ల లింగమ్మ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షులు బక్కన్న గారి లింగంగౌడ్, జిల్లా కార్య దర్శి పంజా మహేందర్, మధుసూదన్‌రెడ్డి, నసీరుద్దీన్, జిట్టి మారుతి, బోయిన చంద్రం, మ్యాదరి రాజు, పురుషోత్తం, లక్ష్మాగౌడ్, రమావత్ వినోద్, ముత్యాల మధుసూదన్‌రెడ్డి, పల్లె రాంచంద్రగౌడ్, యాదగిరి, రవి, సులేమాన్, భాస్కర్ పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో విఫలమైన బిఆర్ఎస్ ప్రభుత్వం

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల పరిధి జంగరాయిలో మాట్లాడుతూ ఉచిత పథకాల పేరుతో భారాస ప్రభుత్వం మోసం చేస్తుందని, సోనియా గాంధీ దయతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కాంగ్రెస్ పాలనలో రైతులకు ప్రతి సంక్షేమ పథకం అందించిందన్నారు. అసైన్డ్ పట్టాలున్నా రైతులకు సైతం రుణాలను అందించినట్లు పేర్కొన్నారు. ధరణి వచ్చిన నాటినుండి అసైన్డ్ భూములకు పట్టాలు,రుణాలు ఇవ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, నెల్లూరు,శ్రీనివాస్‌గౌడ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై సిసి కెమోరాల ఏర్పాటు

**అక్కన్నపేట,సెప్టెంబరు24,ప్రభాతవార్త**

గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం పర్యావరణ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా పనులు నిర్వహిస్తున్నారని అంతే కాకుండా తమకు రావాల్సిన పూర్తి పరిహారం సైతం అందించకుండానే తమ భూములను స్వాదీనం చేసుకున్నారని గుడాటిపల్లి గ్రామానికి చెందిన బద్దం భాస్కర్‌రెడ్డి,సింగిరెడ్డి సురేందర్‌రెడ్డి,కొత్త సంజీవ్‌రెడ్డి,రాగి శివకుమార్‌లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో ఫిర్యాదు చేయగా ఇటీవల ఢిల్లీ,హైదరాబాద్‌ల నుండి అధికారులు వచ్చి సిసి కెమోరాల ఏర్పాట్లకు పనులు పూర్తి చేశారు.ఈ నేపద్యంలో ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అనుమతులు లేనందున తీర్పు వెలువడేంత వరకు పనులు నిలిపి వేయాలని శనివారం రోజున గోదావరి రిజర్వాయర్(డ్యామ్) అధికారులు ప్రాజెక్టు కట్టపై కెమోరాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కెమేరాల దృశ్యాలు హైదరాబాద్‌లోని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆఫీస్‌లో కనబడే విధంగా అనుసందానం చేసినట్లు తెలిపారు.



ఎర్రవల్లి-ఇటిక్యాల రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

## ఎర్రవల్లిని సందర్శించిన పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి

**మర్కుక్, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని సిఎం దత్తత గ్రామం ఎర్రవల్లిని శనివారం పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా ఈఎన్‌సి సంజీవరావు, ఈఈ శ్రీనివాసరావు, డిఆర్‌డిఓ జయదేవ్‌లతో కలిసి సందర్శించారు. గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ళతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎర్రవల్లి గ్రామం నుండి జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల వరకు నిర్మించిన రెండున్నర కిలోమీటర్ల ఎంఆర్ఆర్ గ్రాంట్ బిటి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియాను గ్రామ సర్పంచ్ భాగ్యబిక్షపతి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ ప్రభాకర్, ఎంపిడిఓ ప్రవీణ్, ఎంపిఓ రాజలింగం, ఎంపిటిసి ధనలక్ష్మికృష్ణ, ఏఈ పాష, కార్యదర్శి వికాస్‌రెడ్డి, ఈసి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రహదారులు చెడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**హుస్నాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త** ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద హుస్నాబాద్ మండలంలోని మడద,పోతారం (ఎస్),మహ్మదాపూర్,ఉమ్మాపూర్,నాగారం గ్రామాలలో వేసిన రహదారులను శనివారం రోజున రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా పరిశీలించారు.ఈ సందర్భంగా వేసిన రహదారుల నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు వేసిన రహదారులు త్వరగా చెడిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాన్నారు.ఈ రహదారుల నిరా వ్యాహణను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా హుస్నాబాద్‌కు వచ్చిన సందీప్‌కుమార్ సుల్తానియాకు స్థానిక ఎంపిపి లకావత్ మానససుభాష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు నిరుపేదలకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతు న్నారని బిజెపి మండల ఉపాధ్యక్షులు వడ్లూరి నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ ఏనగంటి కనకరాజులు అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ నిరుపేదలు కార్పోరేట్ అసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకో వడానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అర్హులైన పేదలకు అందిస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన జింకని కిషన్, బట్టికాడి లావణ్య కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వడ్లూరి శేఖర్‌రెడ్డి, అన్నెబోయిన శ్రీనివాస్‌గౌడ్, బచ్చలి చిన్న యాదగిరి, బచ్చలి కనకయ్య, రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విపంచి ఆడిటోరియంలో బీసీ ఐక్యవేదిక సదస్సు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** 33 శాతం మహిళా బిల్లులు బిసి మహిళల వాటా ఎంత అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ పోచబోయిన శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మజ్యోతిబాపూలే,సావిత్రిబాయి పూలేలు ఏర్పాటు చేసిన సత్యశోధక సమాజం ఏర్పడ్డ సెప్టెంబర్ 24న సిద్దిపేట విపంచి కళానిలయంలో బీసీ సాధికారతపై సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలోచన పరులారా రండి సమాలోచన చేద్దాం అనే పేరుతో బీసీ ఐక్యవేదిక అధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశామన్నారు.సమావేశంలో బీసీ నాయకులు బూర మల్లేశం, ధర్మ, ప్రశాంత్, దరిపల్లి శీను, బాలకిషన్, ఎల్లం తదితరులు మాట్లాడారు.

## గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



గురుకుల పాఠశాలల సేక్రటరీకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**కొండపాక, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరిరంచాలని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలల జాయింట్ సేక్రటరీ అనంత లక్ష్మిని హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టిజిపిఎ రాష్ట్ర అధ్యక్షుడు చిట్యాల నర్సింలు ఆధ్వర్యంలో అన్ని జిల్లా కమిటీ అధ్యక్షులతో కలిసి మాట్లాడారు. పాఠశాలలన్నింటికి పొంత భవనాలు నిర్మించాలని, క్రీడా మైదానలు ఏర్పాటు చేయాలని, వర్షా కాలంలో విద్యార్థులు ఈగలు, దోమాలతో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకొవాలని, విద్యార్థులు స్టేషనరీ, మెటీరియల్‌ను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించాలని, మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని, చిన్న పిల్లలకు వేడి నీటి స్నానానికి సౌకర్యాలు కల్పించాలని, పూర్తి స్థాయిలో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులను నియమించాలని కోరగా ఆమె సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సానది నర్సింగరావు, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, నర్సింగరావు, అల్లిబిల్లి బాబు, సుంచు మహేష్, బాల శివ, ఎల్లయ్య, దయాకర్, స్వామి, రవీందర్, రామకృష్ణ, సభ్యులు సుంకరి బిక్షపతి, విద్యార్థుల తల్లిద ండ్రులు తదితరులు పాల్గొన్నారు.



గణనాథునికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్

## గణనాథుని మండపంలో అన్నదానం

**హుస్నాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ భజార్ ఆరవవార్డుతో పాటు 17వ వార్డులో గల గణనాథుల మంటపాల వద్ద శనివారం రోజున అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ హాజరయి గణనాథులకు మొక్కులు చెల్లించుకుని అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మంటపాల నిర్వాహకులు గోగికారు రాకేష్,రంజిత్,మల్లిఖార్జున్‌లతో పాటు మాజీ వార్డు సభ్యులు మైదంశెట్టి వీరన్న,వార్డు కౌన్సిలర్ వల్లపు రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**నర్సాపూర్, సెప్టెంబర్ 23.ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల పెళ్ళిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిఅన్నారు.శనివారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నుండి మంజూరైన 31 కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్ మండల తహశీల్దార్ కమలాద్రి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుల జితేందర్‌రెడ్డి, చిప్పల్‌తుర్తి గ్రామ సర్పంచ్ శ్యామల లక్ష్మణ్ గౌడ్, శ్రీశైలంయాదవ్: నాయకులు హబీబ్‌ఖాన్, నగేశ్, శివకుమార్, ఆంజనేయులుగౌడ్,దావూద్, ఇబ్రాహీం, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## మహిళ రిజర్వేషన్ బిల్లు మహిళల విజయం

### రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి



మాట్లాడుతున్న సునీతారెడ్డి, పాల్గొన్న నాయకులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 23.ప్రభాతవార్త:** మహిళల 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందడంతో ఇది మహిళలు సాధించిన విజయమని కేంద్ర ప్రభుత్వం మహిళ రిజర్వేషన్ 33 శాతం బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంట్ తో పాటు రాజ్య సభలో ఆమోదించడం పట్ల తాను స్వాగతిస్తున్నానని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె నివాసంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మహిళల కల 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో సాకారమయ్యిందని అన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో మహిళలకు ఎంపి,ఎమ్మెల్యేగా టి చేసేందుకు మరింత అవకాశం దక్కనుందని తెలిపారు.ఈ బిల్లును 2027 లో అమలు పరచకుండా వచ్చే ఎన్నికల్లో అమలు పరుస్తే మహిళలలకు మేలు జరుగుతుందన్నారు. నర్సాపూర్ మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, సత్యంగౌడ్, సూరారం నర్సింలు, సుధాకర్‌రెడ్డి , స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

**నర్సాపూర్, సెప్టెంబర్ 23.ప్రభాతవార్త:** నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలో శనివారం పురస్కరించుకొని శ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజా, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు భక్తి శ్రద్దలతో నియమ నిష్ఠలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను భక్తులు చేత ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం అన్నదాతలు భక్తుల అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలోఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళు,ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గణనాధునికి ప్రత్యేక పూజలు చేసిన మహిళ కమిషన్ చైర్ పర్సన్

**నర్సాపూర్, సెప్టెంబర్ 23.ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ కమ్యూనిటి హాల్‌లో ప్రతిష్టించిన గణనాధునికి శనివారం మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు పి.ఆనంద్‌కుమార్ కళ్యాణిల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు. ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో 2 వ వార్డు కౌన్సిలర్ లతరమేశ్‌యాదవ్, చెన్నయ్య,సాయికుమార్, ఎన్జీవోస్ కాలనీ వాసుల తదితరుల పాల్గొన్నారు.

## హర్యానా గవర్నర్‌ను కలిసిన సింగాయిపల్లి గోపి



**నర్సాపూర్, సెప్టెంబర్ 23.ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి శనివారం హర్యానా లోని హర్యానా రాజ్ భవన్‌లో హర్యానా గవర్నర్ బండారి దత్తాత్రేయ ను మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు.

## పాములపర్తి రామాలయంలో గణపతికి ఘనంగా పూజలు

**మర్కుక్, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త):** వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మండల పరిధిలోని పాములపర్తి రామాలయంలో ఏర్పాటుచేసిన మట్టి గణేషునికి శనివారం మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి అర్థం లక్ష్మణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే గణపతి విగ్రహ దాత ఇరుకుల రాజశేఖర్‌గుప్త వినాయకున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహ దాత రాజశేఖర్‌గుప్తను శాలువాతో ఘనంగా సత్కరించారు.



దీక్షలో కూర్చున్న పట్టణ గౌడ కులస్థులు

## చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసేంతవరకు పోరాడుతాం

**చేర్యాల, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసేంతవరకు పోరాడుతామని గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అంబాల రాములు తెలిపారు. రెవెన్యూ డివిజన్ సాధనకై చేస్తున్న దీక్షలు శనివారం 13వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో పట్టణ గౌడ సంఘం సభ్యులు కూర్చోగా వారికి జేఏసి కో-చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి కండువాలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ నెల 29న జేఏసి తలపెట్టిన సడక్ బంద్ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు అన్ని రాజకీయ పార్టీలు హాజరై విజయవంతం చేయాలని జేఏసి నాయకులు తెలిపారు. ఈ దీక్షలో గౌడ సంఘం కులస్థులు బుడిగే వెంకటేష్, చెక్కిళ్ళ కనకయ్య, పచ్చిమడ్ల వెంకటయ్య, బొంగోని భాస్కర్, పచ్చిమడ్ల సిద్ధిరాములు, కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, పోతుగంటి ప్రసాద్, అంబటి అంజయ్య, బుడిగే రమేష్, ఆకుల నరేష్, ఆకుల నరేష్, ఆకుల వెంకటేశం, ఆకుల భానుచందర్, బుడిగే సత్యనారాయణ, గుడాల నర్సయ్య, బాలేష్, శ్రీహరి, గుడాల గణేష్, సిద్ధార్థ, పోతుగంటి కిష్టయ్య, తాటిపాముల పర్శరాములు, బుడిగే శ్రీనివాస్, శివప్రసాద్, అజయ్ కుమార్, అంబ టి శ్రీధర్, గుడాల లింగయ్యలు కూర్చోగా ఆముదాల మల్లారెడ్డి, అందె అశోక్, నారాయణరెడ్డి, తడకలింగం, ఆలేటి యాదగిరి, బండారుసిద్ద య్య తదితరులు సంఘీభావం తెలిపారు.

## ఘనంగా కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం

**చేర్యాల, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** పట్టణంలోని ఏడవ వార్డులో మైసమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండం వద్ద ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం కొమురవెళ్ళి దేవస్థానం కమిటి మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐదవ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ముస్లింలు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలో అంబిక అర్కేడ్ అధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. ప్రతి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ముస్లిం సోదరులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీక సిద్దిపేట పట్టణం నిలుస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, రషీద్ పాషా, షేక్ మహబూబ్, మహ్మదాజీ, సోహబ్, గౌస్‌పాషా, నవాజ్, అంబికా అర్కేడ్ ఫ్యామిలి అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం ఆయుష్మాన్ భవ...

### మైత్రీ ఫౌండేషన్ చైర్మెన్ చెన్నంశెట్టి ఉదయకుమార్




ఆయుష్మాన్ భారత్ ఐడి కార్డులను ఇస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం ఆయుష్మాన్ భవ పేదలకు వరమని గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన మైత్రి ఫౌండేషన్ చైర్మెన్ చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భవ క్యాంపు ఏర్పాటు చేసి సుమారు 100 మందికి పైగా సభ్యుల వివరాలను నమోదు చేసి వారికి ఐడీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని నిరుపేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం ఆయుష్మాన్ భవ అని కొనియాడారు. ఈ పథంకంలో నమోదు చేసుకున్న సభ్యులకు ఐదు లక్షల ఉచిత ఆరోగ్యభీమా లభిస్తుందని తెలిపారు. కావున మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు ఉదయ్ సాగర్, శ్రీకాంత్, వెంకటేష్, నవీన్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుని నిమజ్జన మహోత్సవం



గణనాథుని గంగమ్మ ఒడిలోకి నిమజ్జనం చేస్తున్న భక్తుల దృశ్యం

**కౌడిపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** వినాయక చవితిని పురష్కరించుకోని కౌడిపల్లి మండల వ్యాప్తంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసి, గణనాథుని విగ్రహాలకు గణేష్ శరన్నవ రాత్రి ఉత్సవాలను అతా య్యంత్య వైభవంగా పూజలు చేసిన పిదప శనివారం నాడు ఉదయం కౌడిపల్లి మిని ట్యాంక్ బండ్‌లో గంగమ్మ ఒడిలోకి ఘనంగా నిమజ్జన మహోత్సవం నిర్వహించారు. మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలో యువజన సంఘాల వారు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల నుండి గణనాథులను అంగరంగ వైభవంగా పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, పూర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భారీ బాణ సంచి పేల్చుతూ, డిజే సౌండ్ ద్వారా గణేష్ పాటలకు అనుగుణంగా ఆటలు ఆడుకుంటూ ముందుసాగి పొయారు. కౌడిపల్లి పెద్ద చెరువు వద్ద గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత గంగమ్మ తల్లికి కుంకుమపసుపులతో పాటు పూలతో పూజలు చేసి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలాంటి ఆవాం ఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తీని ఏర్పాటు చేసి, పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మాక్స్ లైఫ్‌తో ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ భాగస్వామ్యం

భారతదేశపు ప్రముఖ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకుల్లో ఒకటైన ఎయుస్మాల్ ఫైనాన్స్‌బ్యాంక్ తన టెక్‌సావీ ఖాతాదారుల నిరంతరం పరిణామం చెందుతున్న అవసరాలని తీర్చడానికి వ్యూహాత్మకంగా వ్యవహరించి మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌తో బ్యాంక్అన్యూరెన్స్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.



నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

## కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** అంగన్‌వాడీ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత కొద్ది రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్చిన్నం చేయడానికి కుట్రలు చేస్తుందని సిఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శశిధర్‌లు మండిపడ్డారు. హైదారాబాద్ రోడ్డులోని ఎంపిడిఓ కార్యాలయం అవరణలో అంగన్‌వాడీ టీచర్లు, అయాలు చేపట్టిన నిరవధిక సమ్మెకు శనివారం వారు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గత 13 రోజులు అంగన్‌వాడీ టీచర్లు, అయాలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వంకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, అయాలను క్రమబద్ధీకరణ చేయడంతో పాటు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10 లక్షలు, అయాలకు రూ.5 లక్షలు చెల్లించడంతో పాటు వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయించి ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, అయాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్‌వాటీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు కళావతి,లక్ష్మీ, అరుణ, అంజమ్మ, లక్ష్మీ, మంజుల,రాజవ్వ, సరళ, కమల తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనపై విసుగుతో ఉన్న ప్రజలు

### డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** సిద్దిపేట నియోజకవర్గంలో అధికార బిఆర్ఎస్ పార్టీపై ప్రజలే తిరుగుబాటు చేసే రోజులు వస్తున్నాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. శనివారం అయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మంత్రి హరీష్‌రావుపై వ్యతిరేకత ఉందని ప్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు, కార్యకర్తలకు, నాయకులకు మాత్రమే పనులు జరుగుతున్నాయని ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. బిఆర్ఎస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రజలు ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 2 లక్షల రుణ మాఫీతో పాటు ఇటీవల విడుదల చేసిన 6 గ్యారెంటీ పథకాలను ప్రజలకు అందించి తీరుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మీసం మహేందర్ యాదవ్, జయంత్, కనకయ్య, గుండూకడి నరేష్, సందబోయిన పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ధర్నా, రాస్తారోకో

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి, మెదక్ నియోజకవర్గ ఇంచార్జి ఏకే. గంగాధర్‌రావు సూచనల మేరకు శనివారం మెదక్ నియోజకవర్గంలోని పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ గ్రామంలో హైవేపై తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా భారీ ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, టీడీపీ పార్లమెంట్ జనరల్ సెక్రటరీ ఎండి. అఫ్జల్, మెదక్ పట్టణ అధ్యక్షులు ఎంఎ. కరీం, హవేళిఘనపూర్ మండల అధ్యక్షులు దమ్ము యాదగిరి, మెదక్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, మెదక్ పట్టణ సెక్రటరీ దుర్గాప్రసాద్, పోచయ్య, సుబ్బారావు, పాపారవు, బాపురెడ్డి, రమేష్, వెంకటేశ్వరరావు, యాదగిరి, గ్రామస్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజల మన్నలను పొందుతున్న పార్టీ బిఆర్ఎస్

### ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి



కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

**కౌడిపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుండి ప్రభుత్వ పార్టీగా ఎదిగిన నాటి టిఆర్ఎస్ పార్టీ నేడు ప్రజల మన్నలను పొందుతున్న పార్టీగా బిఆర్ఎస్ ఎదిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి గర్వంగా పేర్కొన్నారు. శనివారం నాడు కౌడిపల్లి మండల వ్యాప్తంగా గత కొన్ని రోజుల క్రితం కరిసిన భారీ వర్షాలకు పెంకుటిల్లు ధ్వంసం అయిన వారికి నష్టపరిహారం, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి కార్యాక్రమాన్నికి ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి రాజు నాయక్ అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేసిన ఘనత రాష్ట్ర సిఎం కేసిఆర్‌కు దక్కుతుందని ఆయన తెలిపారు. గ్రామీణ స్థాయి ప్రజలలో మమెకమై వారి సమస్యలను పరిష్కరించి, వారి ఆర్థిక అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ ఎంతోకృషి చేస్తున్నందున, తొందరలోనే ఎన్నికలు వస్తున్నాయని, 3వ సారి సిఎంగా కేసిఆర్ గెలుపు ఖాయమని ఆయన జోశ్యం చేప్పారు. గత ప్రభుత్వాలు బిచ్చం వేసినట్లు వృద్దులకు రూ. 200/- ఇచ్చే దానిని బిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 2వేల ఫించన్ అందించి ఘనత మనది అని ఆయన అన్నారు. దేశంలోనే తెలంగాణ రా ష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యమ్రాలతో ముందుకు వెళ్లుతున్నామని ఆయన అన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా 13 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు, వర్షాలకు ఇండ్లు ధ్వంసం అయిన 87 మంది లబ్దిదారులకు రూ. 3200/- ల చొప్పున నష్ట పరిహారం చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు జెడ్పిటీసి కవితా అమర్ సింగ్, వైస్ ఎంపిపి బోడ్ల నవీన్ గుప్త, కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ హైమద్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సార రామాగౌడు, యూత్ అధ్యక్షులు చంద్రం క్రిష్ణాగౌడు, ఎంపిడిఒ శ్రీనివాస్, తహశీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, డిఈఈ అమరేశ్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటీసిలు, లబ్దిదారులు, అధికారులు తదితరలు పాల్గొన్నారు.

## బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి

### నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి నరేందర్‌గౌడ్



ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీలో చేరుతున్న నరేందర్‌గౌడ్

**వెల్దుర్తి, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి నరేందర్‌గౌడ్ అన్నారు. శనివారం జోగిపేట పట్టణంలో నిర్వహించిన బహుజన శక్తి ప్రదర్శన సభలో బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ అధ్యక్షులు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీలో చేరారు. గతంలో నియోజకర్గ బీసీ సంఘం అధ్యక్షులుగా పనిచేసిన నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం 50 శాతానికి పైగా ఉన్న బహుజనులు కేవలం పార్టీల జెండాలు మోయడానికే పరిమితమయ్యారని, ఎన్నో సంవత్సరాల నుండి ఒకే వర్గానికి చెందిన వారు నాయకుల్లా చెలామణి అవుతున్నారన్నారు, బీఎస్పీ పార్టీ బహుజన రాజ్యాధికారం కోసం పని చేస్తుందన్నారు. బహుజన సిద్ధాంతాన్ని గ్రామాల్లో గడపగడపకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధగాపడ్డ నిరుద్యోగులు

## గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దుతో మరోసారి రోడ్డున పడ్డ నిరుద్యోగులు : ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో మరోసారి నిరుద్యోగులు ధగా పడ్డారని, దేశంలోని ఎక్కడ లేని విధ:గా తెలంగాణ రాష్ట్రం పేపర్ లీకులతో, పరీక్షల రద్దులతో మెదటిస్థానంలో నిలిచిన ఘనత కేసీఆర్‌కె దక్కుతుందని, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రెండోసారి రద్దు కావడం ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య పూరిత వైఖరి అని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మరియు ఇతర ప్రశ్నపత్రాలను అమ్మకోవడానికి ప్రయత్నించి లక్షలాదిమంది నిరుద్యోగల జీవితాలను రోడ్డున పడేసిన రాష్ట్ర ప్రభుత్వం పైన చేసిన అనేక ఉద్యమాల కారణంగా పరీక్షలను రద్దుచేసి నిర్వహించిన రీ ఎక్సామ్‌లో కూడా సరైనటువంటి చర్యలు పాటించకుండా ఇష్టానుసారంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించి రెండోసారి కూడా పరీక్ష రద్దుకి కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండోసారి నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణలో బయోమెట్రిక్ వివరాలు, హాల్‌టికెట్ నెంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్ ఇచ్చి అసైంటిఫిక్‌గా పరీక్ష నిర్వహించడం కారణంగా పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రెండోసారి గ్రూప్-1 పరీక్ష రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేయాలనే ఉద్దేశం లేదని, ఎలక్షన్లు దగ్గరకొస్తున్నాయనే కారణంతో ఓటు బ్యాంకు కోసం అడపా, దడపా నోటిఫికేషన్లు ఇస్తూ పేపర్ లీకేజీలతో కుట్రపూరితంగా నిరుద్యోగుల జీవితాలను రోడ్డుకి ఈడుస్తున్నాయని అన్నారు. దీనిలో భాగంగ పేపర్లు అమ్ముకోవడానికి ప్రయత్నించడం, ప్రశ్నా పత్రాల్లో తప్పులు దొర్లే విధంగా వ్యవహరించడం ఏదో ఒక రకంగా కోర్టు ద్వారా పరీక్షను రద్దు చేయించి ఉద్యోగాల భర్తీని ఆపడం కోసం చేస్తున్న కుట్ర మరోసారి తేటతెల్లమైందన్నారు. నిరుద్యోగుల ఆశలపైన నీళ్లు చల్లుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం అనైతికంగా నిరుద్యోగుల పట్ల శాపంగా మారిందని అన్నారు. గతంలో ఏబీవీపీ టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీకి కారణమైన నిర్లక్ష్య ప్రభుత్వం పైన అనేక ఉద్యమాలు చేసి టీఎస్పీఎస్సీ ని ప్రక్షాళన చేయాలని, పేపర్ లీకేజీకి కారణమైన టీఎస్పీఎస్సీ సెక్రటరీ, చైర్మెన్‌లను తొలగించి పారదర్శంగా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా మరోసారి టీఎస్పీఎస్సీతో కుమ్మక్కై కుట్రపూరితంగా రెండోసారి పరీక్ష రద్దు కావడానికి కారణమైందని అన్నారు. గతంలో పేపర్ లీకేజీ సంఘటన పైన కనీసం స్పందించని చేతగాని ముఖ్యమంత్రి ఇప్పటికైనా మొద్దు నిద్రవీడి నిరుద్యోగులకు ఏ విధంగా భరోసాని ఇస్తాడో వెంటనే బహిర్గతంగ క్షమాపన చెప్తూ తమ తప్పుని ఒప్పుకొని బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఏళ్ల తరబడి కొలువుల నినాదంతో ఏర్పడ్డ రాష్ట్రంలో లక్షల మంది నిరుద్యోగులు తమ సర్వస్వాన్ని ధారపోసి కోటి ఆశలతో కొలువుల కోసం కష్టపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పేపరు లీకులతో పరీక్ష రద్దులతో తొమ్మిదేళ్లుగా నియామకాలను తుంగలోకి తొక్కుతూ లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇక పరిపాలించే నైతిక బాధ్యత లేదని హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి దీని పట్ల స్పందించి తప్పిదాలు ఉన్నాయని గ్రూప్-1 పరీక్షలు ఏ విధంగా అయితే రద్దు చేశారో ఆ తప్పిదాలకు కారణమైనటువంఠి టీఎస్పీఎస్సీ ని రద్దుచేసి చైర్మెన్, సెక్రటరీ మరియు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు.



గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్,

## గణేష్ నిమజ్జనానికి ముమ్మర ఏర్పాట్లు

### మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని యువకులంతా గణేష్ నిమజ్జనాన్ని ఆనందోత్సహాల నడుమ జరుపుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. శనివారం నాడు పట్టణంలో గణేష్ నిమజ్జనం చేపట్టనున్న కొచ్చెరువు, సర్వాయికుంట, ఎంకన్నగారి చెరువుల ప్రాంతాలను ఆయన స్థానిక తహశీల్దార్ రజని, మున్సిపల్ కమీషనర్ ఉమాదేవిలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువుల ప్రాంతానికి వెళ్లేందుకు గల రోడ్లను పరిశీలించి, గుంతలు గల రోడ్లకు టిప్పర్ల ద్వారా మట్టిని పోసి మరమత్తు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంతే కాకుండా గణేష్ నిమజ్జన ఊరేగింపు నిర్వహించే ఏరియాలలో హైవే నుండి చెరువుల వరకు స్ట్రీట్ లైట్లు వేయాలని సూచించారు. అట్టి మార్గంలో ప్లాస్టిక్ కవర్లు, చెత్తను తొలగించాలని ఆదేశించారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసుకున్న యువత, ఆయా సంఘాల సభ్యులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. శానిటేషన్, విద్యుత్ తదితర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి ఏ ఆటంకం కలగకుండా నిమజ్జన వేడుకలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ పెంట్యానాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వేదాంతతో పాటు శానిటేషన్, విద్యుత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలోనే ఇంటింటికీ కాంగ్రెస్

### -వంద మంది టీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక : తిరుపతిరెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టే పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హవేళిఘనపూర్ మండల పరిధిలోని బూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లికి చెందిన సుమారు వంద మంది బీఆర్ఎస్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలకు కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ సభలో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు పథకాలను ఇంటింటికీ వివరించేందుకు పెద్దఎత్తన కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. మహిళలకు అండగా గృహలక్ష్మీ పథకం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండ్, ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ఇలా ఆరు రకాల డిక్లరేషన్‌లను కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రకటించిందన్నారు. ఈ డిక్లరేషన్‌తో మహిళలు, యువకులు, రైతులు కాంగ్రెస్ పార్టీలోకి ఆకర్షితులవుతున్నారని, త్వరలోనే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో భారీ ఎత్తున చేరికలు ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. పదేళ్లలతో రైతులకు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఒరిగిందేమి లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గూడూరు ఆంజనేయులుగౌడ్, పీసీసీ నాయకులు మామిళ్ల ఆంజనేయులు, పల్లె రాంచందర్‌గౌడ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు శంకర్, శ్రీనివాస్, ఆంజనేయులు, గోవింద్ నాయక్, శ్యాంసుందర్, శ్రీమాన్‌రెడ్డి, అవారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** వినాయక నవరాత్రులు పురస్కరించుకొని అమీన్‌పూర్ మండలం, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు కల్పన ఉపేందర్‌రెడ్డి, కొల్లూరు గోపాల్, బిజిలి రాజు, కవిత శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, యూనుస్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్,చౌటకూరి మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పటేల్ గూడ బీఎస్ఆర్ కాలనీలో మంచినీటి నల్లా కనెక్షన్లు ప్రారంభం



మంచినీటి నల్లా కనెక్షన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మండలం పటేల్ గూడ గ్రామ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ మంచినీటి నల్లా కనెక్షన్లను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యానికి అనుగుణంగా మిషన్ భగీరథ ద్వారా నూతన కాలనీల్లో శరవేగంగా మంచినీటి నల్లా కనెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. అనునిత్యం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ముచ్చటగా మూడోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పటేల్ గూడ గ్రామ సర్పంచి నితీశా శ్రీకాంత్, దయారా సర్పంచి భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**మెదక్ అర్బన్, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** మెదక్ పట్టణానికి చెందిన రాచర్ల రాజు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయమై స్థానిక కౌన్సిలర్ ఆర్‌కె. శ్రీనివాస్ మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు కౌన్సిలర్ ఆర్‌కె. శ్రీనివాస్, నాయకులు చింతల నర్సింలు, ఉప్పల కిష్టయ్య, కొండా శ్రీనివాస్‌ల ద్వారా రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. రాజు మృతి చెందడం పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఐసీడీఎస్ మంత్రి తప్పుడు ప్రచారం మానుకోవాలి

## సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** ఐసిడిఎస్ మంత్రి ఈనెల 22న మాట్లాడిన వాక్యలను తీవ్రంగా కండిస్తున్నట్లు ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని లేదంటే మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పటాన్‌చెరు శ్రామిక భవన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ అనంతరం జరిగిన సభలో రాజయ్య మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమసనయలు పరిష్కరించకుండా అన్ని పరిష్కారం చేశామని ఐసిడిఎస్ మంత్రి మాట్లాడటం అత్యంత దుర్మార్గమని మంత్రే ఆగస్టు 18 న చర్చలు జరిపారని, నిర్దిష్టంగా కొన్నింటి పైన హామీలు ఇచ్చారని, అదే మంత్రి ఆగస్ట్ 25న ఇచ్చిన హామీలకు బిన్నంగా మోసం చేస్తూ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సగానికి తగ్గించి ప్రకటన చేయటం దారుణమన్నారు. ప్రభుత్వం చేసిన మోసాన్ని కప్పి పుచ్చి అంగన్వాడీ ఉద్యోగులు న్యాయంగా చేస్తున్న సమ్మెపైన దాడి చేయడం అత్యంత హేమమైన చర్య అన్నారు. అంగన్వాడీ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని అడుగుతుంటే, ఈ అంశాన్ని పక్కన బెట్టి కేంద్రం చుట్టూ తిప్పాలని చూడటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న పోరాటం పట్ల తన వ్యతిరేఖ వైఖరిని, అబద్దపు ప్రచారాలు మానుకోవాలని, సమ్మెలో ఉన్న సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్ది ప్రవీణ

## లావణి పట్టా రైతులకూరుణం ఇవ్వాలి
### జడ్పీటీసీ కుమార్‌గౌడ్

**గుమ్మడిదల, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం రోజున నిర్వహించిన జిల్లా పరిషత్తు సమావేశంలో గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొని గుమ్మడిదల మండలంలో ఉన్న పలు సమస్యలపై మాట్లాడారు. రైతుల రుణమాఫీ, ఎర్ర చెరువు కట్ట మరమ్మత్తులో జరిగిన నిధుల దుర్వినియోగం, అన్నారం 261లో ఉన్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు త్వరలో ఇచ్చే లాగున పలు సమస్యలపై మాట్లాడి కలెక్టర్ దృష్టి కి తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ రైతులు రుణమాఫీ చేసిన ప్రభుత్వ పథకం బాగానే ఉన్నా మరో మారు రైతులకు రుణం ఇవ్వడానికి పాస్‌పుస్తకాన్ని మార్ట్‌గేజి చేసుకొని రుణం ఇవ్వడంపై బ్యాంకర్ల తీరు సరైన పద్దతి కాదని మండిపడ్డారు. యధావిధిగా ముందు ఏ విధంగా ఇచ్చిందో ఆ విధంగానే కొనసాగించాలని కోరారు. అలాగే అసైన్మెంట్ భూమి ఉన్న పట్టాదారులకు కూడా రుణం అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలి పారు. అన్నారం సర్వేనంబర్ 261లో గల రైతులకు త్వరలో పట్టాలు అందజేసి వాళ్ల చిరకాల కోరిక నెరవేర్చాలని కోరారు. మండల కేంద్రంలో ఉన్న ఎర్ర చెరువు కట్ల రెండు మార్లు మరమ్మత్తు చేసిన మట్టి కృంగిపోయి యధావిదిగా ప్రమాద స్థితిలో ఉంటుందని అధికారులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ప్రభు త్వ ఖజానాకు భారీ గండి ఏర్పడిందని అక్రమార్కుల జేబులు నిండిన రైతులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదని త్వరలో మరో మారు ప్రణాళిక చేసి మరమ్మత్తు చేసినట్లయితే ఎర్ర చెరువు కట్ట తెగిపోకుండా పలు గ్రామాలన కాపాడిన వారమవుతామని అన్నారు. మండలంలో ఉన్న గ్రామాలు అనంతరం, ప్యారా నగర్ భూముల విషయమై నిక్కు తేల్చి పట్టాదారులకు పాస్‌బుక్కులు అందే విధంగ చర్యలు తీసుకో వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

## గణేశుడికి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూజలు



సంగారెడ్డిలో 10వ వార్డులో వినాయక మండపంలో గణనాథుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని 10వ వార్డులో శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో కొలువుదీరిన పార్వతీ దేవి తనయుడు ప్రథమ పూజలందుకునే వినాయకుడిని శనివారం సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపానికి చేరుకున్న చింత ప్రభాకర్‌ను వినాయక ఉత్సవ కమిటి సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. మండపంలో కొలువుదీరిన లంబోదరుడిని అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సిడిసి చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ విజేందర్‌రెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎఐఎంఐఎంలో చేరిన యువకులు



**సదాశివపేట, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన యువకులు శనివారం ఎఐఎంఐఎం పార్టీలో చేరినట్లు పార్టీ అధ్యక్షులు గౌస్ పాష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో చేరిన యువకులకు పార్టీ ఖండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు గౌస్ పాష పేర్కొన్నారు. రానున్న శాసన సభ, మున్సిపల్ ఎన్నికల్లో ఎఐఎంఐఎం పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని, పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరు శ్రమించాలని సూచించినట్లు గౌస్ పాష పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో అతీఖ్ ఖరేషి, తౌఫిక్ ఖురేషి, అఖీల్, ఇమ్రాన్, నజీర్ పాష, రహమాన్ ఉన్నారు.

## అధికారుల అలసత్వం...
## 25 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

**చౌటకూరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** అధికారుల అలసత్వానికి 25 గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తహతహలాడాల్సిన దుస్థితి దాపురించింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని న్యూ అన్నపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మంజీర ఇంటెక్ వెల్ ద్వార ఆయా గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. గత మూడు రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద సిటీ బీటీ కాలిపోవడంతో నీరు సరఫరా ఆగిపోయింది. కాలిపోయిన సిటీ బీటి కొత్తది ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలకు నీటి ఘోష తప్పడం లేదు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చిన మాకు సంబంధం లేదని దాటవేస్తున్నారని మంజీర కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు తాగు నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు ఎస్ ఇటిక్యాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం
### -హాజరుకానున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌లు

**పుల్కల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** ఈ నెల 24వ తారీఖున అందోల్ శాసన సభ్యులు చంటి క్రాంతి కిరణ్, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డిలు మండలంలో పర్యటించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాచర్ల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం మండలంలోని ఎస్ ఇటిక్యాల గ్రామంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో 400 మందికి ఇనాం భూమి పట్టాలను ఎమ్మెల్యే పంపిణి చేస్తారన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టనున్నారన్నారు. కాకతీయ యూనివర్సిటీ జెఏసి నాయకులు ఎర్రోళ్ల పోచయ్యతో పాటు 100మంది కాంగ్రెస్, బిజెపి నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కారెక్కనున్నారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, ప్రజాప్ర తినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయవంతం చేయాలని విజయ్ కుమార్ సూచించారు.

### కొత్త వైఫై కన్వర్టిబుల్ సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్

భారతదేశంలోని ప్రముఖ కన్స్యూమర్ డ్యూరబుల్అండ్ ఎయిర్ కండిషనర్ బ్రాండ్‌లో ఒకటైన ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండి యా తన విప్లవాత్మక వైఫై కన్వర్టిబుల్ సైడ్‌బై సైడ్ రిఫ్రిజిరే టర్‌ను ఆవిష్కరించింది. ఎల్జీతింక్ యాప్‌ను ఉపయోగించి ఎక్కడినుండైనా ఫ్రీజర్‌ను ఫ్రిజ్‌గా మార్చడానికి ఇది విని యోగదారులకు వీలు కల్పిస్తుంది.

# మంచమెక్కిన హుస్నాబాధ..!
### -రెండువందల మంది రోగులకు ఒక్కరే వైద్యులు

**హుస్నాబాద్, సెప్టెంబరు23, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మంచం పట్టి మూలుగుతోంది. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి వైరల్‌జ్వరాలతో రోగులు, జనం అల్లాడిపోతున్నారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రాథమికస్థాయి దవాఖాన కాస్త తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సామాజిక ఆరోగ్యకేం ద్రంగా పునరుద్ధరించారు. అయినప్పటికీ సామాజిక స్థాయి దవాఖానలో పక్కా భవనాలు నిర్మించినప్పటికీ అక్కడ విధుల్లో ఉండా ల్సిన వైద్యులనునియమిం చకపోవడంతో రోగులు అల్లాడాల్సిన పరిస్థితులు నెలకొం టున్నాయి. ఈ వైరల్‌జ్వరాతో రోగులు అల్లాడిపోతున్నా చేయిపట్టి చూసిన వైద్యులు లేక రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో 200మంది రోగులకు గాను పరీక్షలు చేయడానికి ఒక్క డాక్టర్ మాత్రమే విధుల్లో ఉండటం గమనా ర్హాం. రోగులకు సరిపడా వసతులు లేక వారని కుర్చీలో కూర్చుండబెట్టే వీలు లేక రోగితో వచ్చిన వారి కుటుంబసభ్యులకు సైతం ఇక్కట్లకు గురికావాల్సి వస్తోంది. ఈ వర్షాకాల సీజ న్ పుణ్యామా అని పట్టణంతో పాటు మండల ప్రాంతాల్లోని పల్లెల్లో సైతం ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోగులు అసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకునే క్రమంలో వారికి కావాలసిన వసతులు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం తాగడానికి మంచినీరు కూడా అందుబాటులో ఉండటం లేదు. క్యూలైన్లలో వారు నిల్చో వడం కూడా ఇబ్బందికరంగానే మారుతోంది. ఆసుపత్రి సూపరిండెంట్ రమేష్‌రెడ్డి సైతం ఏర్పాట్ల విషయంలో స్పందించడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అలాగే హుస్నాబాద్ ఆసుపత్రిలో విధుల్లో ఉండాల్సి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నంగునూరు నుండి శివకుమార్ అనే డాక్టర్ నిత్యం హుస్నాబాద్ ఆసుపత్రికి వస్తున్నారని అంటున్నారు. ఆ డాక్టర్ హుస్నాబాద్‌కు వస్తుంటే నంగునూరు ఆసుపత్రి పరిస్థితి ఏంటని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గడిపె మల్లేష్ ప్రశ్నిస్తూ ఇంత పెద్ద హుస్నాబాద్ ఆసుపత్రికి వైద్యుని ఇంకా నియమించరా అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి హుస్నాబాద్ ఆసుపత్రికి వైద్యాధికారిని నియమించి రోగుల ఇక్కట్లకు పరిష్కా రం చూపాలని గడిపె మల్లేష్ కోరుతున్నారు.



ఆసుపత్రిలో విపరీతంగా రోగుల దృశ్యం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల దృశ్యం



అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్షకు మద్దతు పలుకుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

## అంగన్‌వాడి ఉద్యోగుల దీక్షకు మాజీ మంత్రి మద్దతు

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** తమ న్యాయమైన సమస్యల సాధన కోసం గత 13 రోజులుగా అంగన్‌వాడి ఉద్యోగులు పట్టణంలోని రెవిన్యూ కార్యాలయం ముందు అంగన్‌వాడి ఉద్యోగులు చేస్తున్న సమ్మె, దీక్షను శనివారం మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య సమన్వయకర్త డాక్టర్ ఎ చంద్రశేఖర్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించి దీక్షా పరులకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడిల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని, వెంటనే సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు ఎంజి రాములు, గొల్ల భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, రామలింగారెడ్డి, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి: జడ్పీటిసి



జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటిసి వినీల నరేష్

**ఝరాసంగం, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని మండల జడ్పీటిసి సభ్యురాలు వినీల నరేష్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీటిసి వనీల పాల్గొని మండలానికి అవసరమైన పనులను సభ దృష్టికి తెచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎల్గోయి గ్రామం నుంచి న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామానికి వెళ్లే దారిలో గల మామిడి వాగుపై, బోపన్‌పల్లి నుంచి పవరం రోడ్డులో కల్వర్టులు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సూచించారు. మండలంలో కేజీబివి, మోడల్ స్కూల్‌లు కొనసాగుతున్నాయని, జూనియర్, డిగ్రీ కళాశాలను మంజూరు చేసి విద్యాభివృద్దికి సహకరించాలని వినతి చేసినట్లు పేర్కొన్నారు. అతివృష్టిలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సభ దృష్టికి తీసుకుపోయినట్లు జడ్పీటిసి వినీల నరేష్ పేర్కొన్నారు.

## ఎంపీటీసీ తండ్రి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే



ఎంపీటీసీ ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**రాయపోల్, సెప్టెంబర్23 ప్రభాతవార్త :** రాయపోల్ మండలం వడ్డేపల్లి ఎంపీటీసీ చాకలి ప్రభాకర్ తండ్రి చాకలి సత్తయ్య ఆనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యేమాధవనేని రఘునందన్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంతక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్తయ్య ఆనారోగ్యంతోమృతి చెందడం చాలా బాధకరమన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట బిజెపి సీనియర్‌నాయకులు రాజాగౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మంకిడి స్వామి, మండల నాయకులు నీల స్వామి, గ్రామ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో 142 రద్దు చేయాలి
### టీఎన్జీవో మెడికల్ అండ్ హెల్త్ ఫోరం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల అనురాధ

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య శాఖలోని జీవో 142 ను రద్దు చేయాలని టీఎన్జీవో మెడికల్ అండ్ హెల్త్ ఫోరం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల అనురాధ డిమాండ్ చేశారు. శనివారం డీఎంహెచ్‌వో డా. చందునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు జీవో 142 గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. మానవ వనరుల హేతుబద్దీకరణ అనేది జనాభా ప్రాతిపదికన ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడం కోసం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో అపారమైన అనుభవం ఉన్న క్షేత్రస్థాయిలో పనిచేసిన వైద్య ఆరోగ్య రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుంచి క్షేత్రస్థాయి సమాచారాన్ని, సలహాలు, సూచనలు తీసుకోకుండా తన ఇష్టాను సారంగా ఈ జీవోను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే జీవో నెంబర్ 142ను రద్దు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంజుల, సదానందం, లక్ష్మీనర్సమ్మ, రాధ, అమృత, జిల్లాలోని సీహెచ్‌వోలు సంగయ్య, రమేష్, సిద్ధప్ప, యాదయ్య, మల్లికార్జున్, సంపతి, మేరీ, గ్రేసి, వినోల, కృష్ణవేణి తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇండ్లు కూలిపోయిన బాధితులకు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

## పేదల సంక్షేమం కోసం సిఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్23 ప్రభాతవార్త :** పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. కొల్చారం మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన బాధితులకు నగదు అందజేశారు. శనివారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని రైతువేదికలో తహశీల్దార్ మహమ్మద్ గఫార్ మియా అధ్యక్షతన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన బాధితులకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని ఇండ్లు కూలిపోయిన 26 మందికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి 3,200 రూపాయల చొప్పున నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని, యావత్తు దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. మండలంలో దళితబంధును పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, సర్పంచి కరెంటు ఉమా రాజాగౌడ్, ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణాగౌడ్, మాజీ ఉప సర్పంచి చౌరిగారి చిన్న రాములు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్‌గుప్త, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, యాదగిరి, కొమ్ముల యాదాగౌడ్, చిట్యాల యాదయ్య, గడ్డమీది నర్సింలు, గజిని వెంకట్‌గౌడ్, కొమ్ముల రవీందర్‌గౌడ్, బండి రమేష్, సోమ నర్సింలు, దొడ్ల ఆంజనేయులు, శ్రీకాంత్, పాల్వంచ కృష్ణాగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుంఖసంతోషాలతో ఉండాలి : సునితాలక్ష్మారెడ్డి



వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సునితా లక్ష్మారెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొల్చారం మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వినాయ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అనంతరం వినాయ కుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వినాయకుని దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల సంతోష్, సర్పంచి ఉమాదేవి రాజాగౌడ్, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, చిట్యాల యాదయ్య, మాజీ ఉప సర్పంచి చౌరిగారి చిన్న రాములు, చౌరిగారి భాస్కర్, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**వెల్దుర్తి, సెప్టెంబర్23 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న అని స్థానిక ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో యువకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచి భాగ్యమ్మ ఆంజనేయులు, శివ్వంపేట జెడ్పీటీసీ మహేష్‌గుప్త, బీఆర్ఎస్ నాయకులు రమేషనగుప్త, మహేష్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని, ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మంచి ఆలోచన అని కొనియాడారు. గ్రామాల్లో సైతం రక్తదాన శిబిరాలు నిర్వహించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, ఈవో పీఆర్డీ బలరాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోట నర్సింలు, శివ్వాగౌడ్, యువకులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు పలుకున్న బిజెపి నాయకులు

## అంగన్‌వాడీల సమ్మెకు పార్టీల మద్దతు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రెవిన్యూ కార్యాలయం ముందు అంగన్‌వాడి ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు భారతీయ జనతా పార్టీ, తెలంగాణ జన సమితి నాయకులు శనివారం వేరు వేరుగా మద్దతు పలికారు. దీక్షా శిబిరానికి చేరుకున్న ఆయా పార్టీల నాయకులు అంగన్‌వాడిల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని బిజెపి మండల అధ్యక్షులు ఏక్‌నాథ్‌రావు పాటిల్, తెలంగాణ జనసమితి నియోజకవర్గ ఇంచార్జి మొగుడంపల్లి ఆశప్పలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసిన హామీలను వెంటనే అమలు పర్చాలన్నారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రాగానే అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని అధ్యక్షులు ఏక్‌నాథ్‌రావు పాటిల్ హామి చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ గంగ్వార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ చారి, జిల్లా ముదిరాజ్ మండల దళిత మోర్చా అధ్యక్షులు అర్జున్, నాయకులు నర్సింలు, శివకుమార్, తెలంగాణ జన సమితి జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి మొగుడంపల్లి ఆశప్పలు పాల్గొన్నారు.

## 13వ రోజుకు చేరిన అంగన్‌వాడి ఉద్యోగుల సమ్మె

**కొండాపూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్ సాధన కోసం అంగన్‌వాడి ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహా దీక్ష శనివారంతో 13వ రోజుకు చేరుకున్నాయి. మండల కేంద్రమైన కొండాపూర్‌లో అంగన్‌వాడి ఉద్యోగులు చేస్తున్న దీక్షను సిఐటియు మండల కన్వీనర్ బాబురావు హాజరై తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఉద్యోగులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి దున్నపోతు మీద వర్షం పడిన చందగా వ్యవహరిస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి టిఏ, డిఏలు చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. అంగన్‌వాడి సెంటర్ తాళాలను దొంగల్లా పగలగొట్టడం ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శమని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడి యూనియన్ నాయకులతో చర్చలు జరిపి పరిష్కరించాలని హితువు పలికారు. అంగన్‌వాడి యూనియన్ నాయకులు భ్రమరాంబ, అరుణ, శశికళ, శాంతమ్మ, సునంద, ప్రమీల, అనుసూజ పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో నియంత పాలన ఇంకెన్నాళ్లు



మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

**పాపన్నపేట, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో నియంత పాలన కొనసాగిస్తున్న హిట్లర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం చమరగీతం పలకాల్సిన అవసరం ఉందని మెదక్ జిల్లా టిడిపి అధ్యక్షులు అఫ్జల్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం పాపన్నపేట మండల పరిధిలోని లక్ష్మీనగర్ పరిధి మెదక్-బొడ్మెట్‌పల్లి ప్రధాన రహదారిపై టిడిపి నాయకులు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు అఫ్జల్ మాట్లాడుతూ ఏపి సిఎం జగన్ చంద్రబాబుపై అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందుతున్నాడని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇప్పటికైనా తన తప్పును తెలుసుకుని చంద్రబాబునాయుడుపై బనాయించిన అక్రమ కేసులను భేషరుతగా ఎత్తేసి ఏపి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తుండటంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవడంతో రాకపోకలు ఎక్కడికి అక్కడే ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న పాపన్నపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టిడిపి నాయకులకు నచ్చచెప్పి ధర్నా విరమించేలా కృషి చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి సహకారం సంఘం చైర్మన్ రమేష్ గుప్తా, చావ బావపావు, యాదగిరి, దుర్గయ్య, జనార్ధన్, బాపురెడ్డి, రామగౌడ్, ప్రసాద్, వెంకన్న, బలరాం నాయక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న జాడిమల్కాపూర్ కాంగ్రెస్ నాయకులు

**జహీరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు కారెక్కే కార్యక్రమాలు జోరుగు కొనసాగుతున్నాయి. శనివారం నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జ్యోతిరాజు, ఎంపిటిసి సభ్యులు శిరీష భరత్‌రెడ్డ ఆత్మ కమిటి డైరెక్టర్ పరశురాం, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి, వార్డు సభ్యులు బాలప్ప ఆధ్వర్యంలో కారెక్కారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులను బిఆర్ఎస్ ఖండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులపై బిఆర్ఎస్‌లో ఆయా పార్టీల నాయకులు చేరుతున్నారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు తిరుమలేశు, రాములు, నాగప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

### హైపర్‌టెన్షన్ రోగులకు బాదంపప్పులు ప్రయోజనం

పీసీఓఎస్‌టైప్-2 డయాబెటిస్ హైపర్‌టెన్షన్‌తో పోరాడుతున్న వ్యక్తుల ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా బాదంపప్పులు ప్రయోజనకంగా ఉన్నాయని యువ్‌గౌతాజా సర్వేలో వెల్లడిం చింది. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా24 జనవరి-6 ఫిబ్ర వరి మధ్య నిర్వహించిన యువ్ గౌసర్వేలో భారతదేశంలోని చాలా పట్టణ నగరాల్లో ఊబకాయం, మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు వంటి జీవనశైలి సంబంధిత ఆరోగ్య సమ స్యలు పెరుగుతున్నట్లు నివేదించబడింది. ఈ సర్వే ఫలితాలపై ఢిల్లీమ్యాక్స్ హెల్త్ కేర్ డైటెటిక్స్ రీజనల్ హెడ్‌రితి కాసమద్దర్ మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు, ప్రోటిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు విటమిన్లు, ఖనిజాలతో సహా మన శరీరాలు సరిగ్గా పనిచేయడానికి అవసరమైన పోషకాలుశక్తిని సమతుల్య ఆహారం అందిస్తుం దన్నారు.